క్లుప్తంగా

పర్యావరణాన్ని కాపాడాలి


మాట్లాడుతున్న ఆచార్య సత్యవీర్

నర్సాపూర్: పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పట్టణంలోని సువిజ్ఞాన ఆశ్రమం వ్యవస్థాపకుడు ఆచార్య సత్యవీర్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. వచ్చే వినాయక చవితి పండగ, నవ రాత్రులను పురస్కరించుకొని యువకులు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధానంగా పీఓపీతో తయారు చేసిన వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయొద్దన్నారు. ఏటా పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి విగ్రహాలు వినియోగించాలని పర్యావరణవేత్తలు సూచనలిస్తున్నా.. చాలా మంది పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రధానంగా యువత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కాగా మట్టి వినాయక విగ్రహాలు తయారు చేసే కళాకారులు త్వరలో నర్సాపూర్‌కు రానున్నారని తెలిపారు.

రేగోడ్‌ను సంగారెడ్డి జిల్లాలో కలపాలి

రేగోడ్(మెదక్): రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు జోరందుకున్నాయి. తాజాగా గురువారం మండల కేంద్రంలోని యువకులు ఆదిత్యగౌడ్, వినయ్, అఖిల్‌లు సీఎం కేసీఆర్‌కు పోస్టు ద్వారా లేఖలు పంపించారు. రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని ఆ లేఖల్లో విజ్ఞప్తి చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కౌడిపల్లి(నర్సాపూర్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం కౌడిపల్లిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితులు ఫోన్‌చేసి బ్యాంక్ ఖాతా, ఏటీఎం నంబర్లు, ఓటీపీ అడిగితే చెప్పొద్దన్నారు. మద్యం సేవించి, ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్‌తో వాహనాలు నడపొద్దని చెప్పారు. నాగ్సాన్‌పల్లి సర్పంచ్ ఎల్లం, హెడ్ కానిస్టేబుల్ ఎలియాస్‌రెడ్డి, పీసీలు బాగయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు


ప్లేట్‌లు కడుగుతున్న విద్యార్థులు

నిజాంపేట(మెదక్): మండలంలోని నస్కల్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సదుపాయం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు నస్కల్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకే కాంప్లెక్స్‌లో ఉండడం వలన పాఠశాలలో బోర్ లేక పోవడంతో మధ్యాహ్న భోజనం సమయంలో పిల్లలు పాఠశాల బయట ఉన్న ఎల్లమ్మ టెంపుల్ వద్దకు వెళ్లి ట్యాంప్ నీళ్ల కోసం తోపులాడుకుంటున్నారు. ఈ విషయమై తల్లిదండ్రులు చాలాసార్లు ఉపాధ్యాయులకు, కాంట్రాక్టర్లకు విన్నవించిన్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి విద్యార్థులకు తాగు నీటి సమస్యను తీర్చాలని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

తూప్రాన్: రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని యావాపూర్‌కు చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, సురేందర్ రెడ్డి, సింహం, స్వామి, ఉపసర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు రాజు, చెట్లపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సత్యార్థి ఫౌండేషన్, కార్వెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం బాలల హక్కులపై అవగాహన కల్పించారు. సంస్థ సోషల్ మొబిలైజర్ సత్యనారాయణ మాట్లాడుతూ .. బడీడు పిల్లవాడు పాఠశాలలో ఉండాలని, బాలల అక్రమ రవాణా, బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సులు రాని బస్టాండ్

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- మరమ్మతు పనులకు నోచుకోని వైనం
- అధికారుల పర్యవేక్షణ కరువు


నిరుపయోగంగా మారిన ప్రయాణ ప్రాంగణం

వెల్దుర్తి(తూప్రాన్): బస్టాండ్‌లో మౌలిక సదుపాయలు లేకపోవడంతో ప్రయాణికులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ నిర్వహణ లోపంతో రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకుంటుందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సుమారు 16 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్‌లో మొదట ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది కోసం అన్ని వసతులు కల్పించారు. బస్సుల రాకపోకలు పరిశీలించేందుకు ఆర్టీసీ అధికారులు కంట్రోలర్‌ను కూడా నియమించారు. అయితే కొన్నాళ్లకు కంట్రోలర్‌ను తీసేశారు. అప్పటి నుంచి బస్టాండ్ బాగోగులు చూసుకునే వారు కరువయ్యారు. దీంతో బస్టాండ్‌లో ఉన్న బెంచీలు, విద్యుత్ దీపాలు ఇతరాత్ర వస్తువులు, కనీస సౌకర్యాలు కూడా దెబ్బ తిన్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బస్టాండ్ మరమ్మతు పనులకు కూడా నోచుకోవడం లేదు. ఈ విషయమై ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకపోయినా.. ఫలితం లేదు. బస్టాండ్ ఆవరణ గుంతలమయంగా మారింది. దీంతో కొంతమంది బస్సు డ్రైవర్‌లు బస్టాండ్‌లోకి బస్సులను తీసుకరావడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో బస్టాండ్ ఆవరణంతా చిత్తడిగా మారుతుంది. అదేవిధంగా కంట్రోలర్ కోసం ఏర్పాటు చేసిన రెండు గదులు ఎల్లప్పుడు తాళంతో దర్శనమిస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


తాళం వేసిన గదులు

ఇబ్బందులు పడుతున్నాం



బస్టాండ్‌లో మౌలిక వసతులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో రోడ్డు పక్కన దుకాణాల ఎదుట నిలబడాల్సి వస్తుంది. వర్షాలు కురుస్తున్నప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– శ్రీనివాస్, అందుగులపల్లి

వసతులు కల్పించాలి



ఒకప్పుడు బస్టాండ్ ప్రాంతం ప్రయాణికుల రాకపోకలతో కళకళలాడుతుండేది. బస్టాండ్‌లో వసతులు లేకపోవడం వల్ల ప్రయాణికులు రోడ్లపైనే ఉండటంతో సిబ్బంది కూడా అక్కడే ఆపుతున్నారు. అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలి.

– చిరంజీవి, ప్రయాణికుడు, ఏదులపల్లి

భూములున్నా పాస్‌పుస్తకాలు ఇవ్వడంలేదు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వతడం లేదని గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతులు చాకలి నర్సయ్య, మాసంగారి రాములు, చిన్న పోచయ్య, పెద్ద పోచయ్య మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నా భూములకు సంబంధించన ధరణి రికార్డులో నమోదు కాలేదన్నారు. ఈ విషయం గురించి పలుమార్లు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, ఆన్‌లైన్‌లో మిస్సింగ్ ఉందని, మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారన్నారు. మీసేవలో దరఖాస్తు చేసుకొని నెలల గడుస్తున్నా.. నేటికి నమోదు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే చేసి పోజిషిన్ రిపోర్టు నమోదు చేసినప్పటికీ పట్టాదార్ పాస్ పుస్తకాలు రాలేదని వాపోయారు. ఈ విషయం గురించి తహసీల్దార్ శ్రీనివాస్‌చారి దృష్టికి తీసుకెళ్లగా.. పలువురు రైతులకు సంబంధించి భూముల వివరాలు హెచ్చుతగ్గులు ఉన్నాయన్నారు. దీంతో ఇబ్బందులు తలెత్తాయని సరిచేసి అర్హులైన రైతులకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మండలం కోసం దీక్షలు ప్రారంభం

- డివిజన్ కోసం రామాయంపేటలో ఐదు నెలలుగా దీక్షలు


ప్రగతి ధర్మారంలో దీక్ష చేస్తున్న గ్రామస్తులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఒకవైపు ఐదు నెలలుగా దీక్షలు కొనసాగుతున్నాయి. మరోవైపు మండల పరిధిలోని ప్రగతి ధర్మారం గ్రామాన్ని కొత్త మండలముగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు అఖిల పక్షం పేరిట గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలం ఏర్పాటుకు గ్రామంలో అన్ని రకాల వసతులున్నాయని పేర్కొన్నారు. గ్రామాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేసే వరకు విశ్రమించమని, ఆందోళన తీవ్రతరం చేస్తామని అఖిలపక్షం ప్రతినిధులు స్పష్టం చేశారు. ముందుగా గ్రామస్తులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలువేసి దీక్షలు ప్రారంభించారు. ఈనెల 23న జిల్లాకు వస్తున్న సీఎం కేసీఆర్ ప్రకటన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

బంగారమ్మ ఆలయ భూమిని రక్షించండి


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాళ్లకల్ గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): కబ్జాకు గురవుతున్న బంగారమ్మ దేవాలయ భూమిని పరిరక్షించాలని కాళ్లకల్ గ్రామస్తులు గురువారం ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డికి వినతిపత్రం గ్రామస్తులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మల్లేశ్, పాలకవర్గం, గ్రామస్తులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని కాళ్లకల్ శివారులో జాతీయ రహదారికి ఆనుకొని తాతముత్తాల కాలం నుంచి వనదుర్గ బంగారమ్మ దేవాలయం ఉందని, ఆ ఆలయ భూమిలో గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, వన భోజనాలు, తదితర కార్యక్రమాలను నిత్యం నిర్వహించుకుంటున్నమని తెలిపారు. ఈ స్థలాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న ముత్యం సూర్యనారాయణ, రమేశ్‌లు తమ తండ్రి పేరా పట్టా ఉందని బంగారమ్మ దేవాలయ భూమిని కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రశ్నిస్తే కేసులు వేయిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమిని పరిరక్షించాలని ఎస్‌ఐని కోరామని వివరించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ నిలిపివేత

తూప్రాన్: విద్యుత్ బకాయిలు లక్షల్లో పేరుకుపోయాయని విద్యుత్ అధికారులు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సుమారు రూ.6 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.2లక్షలు, పీహెచ్‌సీ రూ.3 లక్షలు, మున్సిపల్ కార్యాలయం రూ.2లక్షలు, ఎంపీడీఓ కార్యాలయంలోని ఐకేపీ, ఈజీఎస్, కార్యాలయం సుమారు రూ.లక్ష వరకు బకాయిలు ఉన్నట్లు ఓ విద్యుత్ అధికారి పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశామన్నారు. కాగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గజ్వేల్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి ఆదేశాల మేరకు తిరిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన


రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ మేధావుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ, విద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. వ్యవసాయ, హార్టికల్చర్ పంటల ఉత్పత్తి మెరుగుపర్చడం, రైతులకు ఇన్‌పుట్, అవుట్‌పుట్ మార్కెటింగ్ లింకేజిలకు అనుసంధానం చేయడం వంటి వాటిపై వివరించారు. అనంతరం టీఐపీ ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ, బ్యాంకింగ్ రంగాల రిటైర్డ్ ఉద్యోగులు తెలంగాణ మేధావుల సంఘం ఏర్పాటు చేసి రైతుల ప్రయోజనాలు కాపాడడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమ, చేపల పెంపకం, జంతువుల పెంపకం, కోళ్ళ పరిశ్రమల ఏర్పాటు, వివిధ రైతు సంఘాల నిర్వహణకు సాంకేతిక సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలన

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం స్టేషన్ మాసాయిపేట్ గ్రామం నుంచి రామంతాపూర్ తండా వరకు 44వ జాతీయ రహదారి పక్కన నాటిన మొక్కలను గురువారం ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఎంపీఓ విగ్నేశ్వర్ పరిశీలించారు. అక్కడక్కడ ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటించారు. మొక్కలు నిటారుగా పెరిగేలా సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

మైనంపల్లి రోహిత్ ఎమ్మెల్యే కావాలని పాదయాత్ర

మెదక్ మున్సిపాలిటీ: మైనంపల్లి రోహిత్ ఎమ్మెల్యే కావాలని మెదక్ జిల్లా కేంద్రం జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి గురువారం 30 మంది గిరిజన యువకులు కొంపల్లి సేవాలాల్ ఆలయం వరకు పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. మైనంపల్లి రోహిత్ ఎమ్మెల్యే కావాలని యువకులు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ పాదయాత్ర 30మందితో ప్రారంభమై, మార్గ మధ్యలో తండా యువకులతో మొత్తం 500 మంది కలిసి కొంపల్లి సేవాలల్ ఆలయానికి చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో తిమ్మన్నగారి అనిల్ కుమార్, బొజ్జ పవన్, పరుశురాం గౌడ్, భరత్, గిరిజన నాయకులు జగన్, రంజిత్, గోపి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కాలేజీలో విద్యార్థుల ధర్నా

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురకుల బాలుర కాలేజీ విద్యార్థులు గురువారం కళాశాల ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన గురుకుల కాలేజీని, పాఠశాలను ఒకే చోట కలిపి కొనసాగించడంతో తాము ఇబ్బందుల పాలువుతున్నామని కాలేజీ ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలేజీని, పాఠశాలను వేర్వేరుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాగా గురుకులం ప్రిన్సిపాల్ భిక్షమయ్య మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలను కాలేజీని కలిపి నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

బీజేపీ నాయకులు


నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు


వెల్దుర్తి(తూప్రాన్): వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కార్యకర్తలు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని, దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దిలీప్‌కుమార్, కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు సంగయ్య, సిద్ధారాంలు, ఓబీసీ మోర్చా ప్రతినిధి కార్తీక్, మహిళా మోర్చా అధ్యక్షురాలు లావణ్య, నాయకులు నర్సింలు, దయానందరెడ్డి, శేఖర్, రమేశ్, జగన్, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని, ఇంకా పలు డిమాండ్లతో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు, రైతులకు రుణ మాఫీ, బీసీలకు ఆర్థికసాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో మల్లేశ్‌గౌడ్‌తో పాటు పార్టీ నాయకులు రమేశ్‌గౌడ్, రాజేందర్, అనిల్, ప్రేంకుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ విఫలమైందని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు పాపన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన వారిలో బీజేపీ నాయకులు సంతోష్, సుధాకర్, నరేశ్, చందయ్య, రమణ, ప్రకాశ్‌నాయక్, రాంచందర్, నర్సింలు, యేసు, సాయిబాబా, దుర్గయ్య పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులను ఎస్‌ఐ నారాయణ తమ సిబ్బందితో అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, నాయకులు సురేశ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, దశరథం, ఆకుల రాజు, మంజుల పాల్గొన్నారు.

హవేళీఘనపూర్: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించిన వారిలో వారిలో బీజేపీ మండలాధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, మండలంలోని ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ నాగవర్దన్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో నియోజకవర్గం నాయకులు రఘువీరా రెడ్డి, మండలాధ్యక్షుడు నర్సింలు, శేఖర్ గౌడ్, నవీన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన వారిలో మెదక్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మత్తులో తల్లిని కొట్టిన తనయుడు

నర్సాపూర్: మద్యంమత్తులో విచక్షణ కోల్పోయి కన్నతల్లిని కొట్టాడో ప్రబుద్ధుడు. మండలంలోని నత్నాయిపల్లికి చెందిన చెందిన నాగరాజు తల్లి సాలమ్మను కొడుతుండగా గ్రామస్తులు విడిపించారు. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు పరారీలో ఉన్నాడు.

◆ మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా అఫ్సర్

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా అఫ్సర్‌ను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ కమిటీ చైర్మన్ షేక్ మజహర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యులు సుప్రభాత్‌రావు, మ్యాడం బాలకృష్ణ, కొడుపాక మాజీ సర్పంచ్ భూమయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ సల్మాన్, ఓడీసీ సెల్ అధ్యక్షుడు కమ్మరి మురళి తదితరులు ఆయనను సన్మానించారు.

◆ నిజాంపేటలో జియో సిగ్నల్స్ అంతరాయం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో రెండు రోజులుగా జియో సిగ్నల్స్ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇంటర్ నెట్, మీసేవ, ప్రభుత్వ కార్యాలయాలల్లో పనులు మొత్తం నిలిచి పోయాయి. అధికారులు స్పందించి సేవలు పునరుద్ధరించాలన్నారు.

◆ మట్టి తరలింపు

నర్సాపూర్ రూరల్: మండలంలోని మాదాపూర్ పంచాయతీ పరిధిలోని సూర్య తండా సమీపంలోని ప్రభుత్వ భూమిలో కొంతమంది అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. మూడు రోజులుగా ఓ ప్రైవేట్ వెంచర్‌కు అక్రమంగా మట్టి తరలిస్తున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ కమలాద్రిని వివరణ కోరగా.. తన దష్టికి రాలేదన్నారు. విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

◆ విద్యార్థులకు గ్లాసులు

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలలోని పిల్లల్లో పోషకాహార లోపం నివారణకు ప్రభుత్వం ప్రతీ మంగళ, గురు, శని వారాల్లో రాగి జావ పంపిణీ చేస్తుందన్నారు. పిల్లలు రాగి జావ తాగడానికి సులభంగా వుండేలా ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో మాసాయిపేట్ మండలంలోని రామంతాపూర్ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 65 స్టీల్ గ్లాస్‌లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం నవీన్, ఉపాధ్యాయురాలు ఉదయ శ్రీ, సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ నిత్యావసర వస్తువుల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన మన్నే నాగరాజు కొడుకు సాయిచరణ్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం సంగారెడ్డిలోని అనాథ ఆశ్రమంలో బియ్యం, నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ నర్సింలు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ కెమెరాలు ఏర్పాటు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేట శివారులోని ఎల్లమ్మ దేవాలయంలో ఇటీవల చోరీ జరిగింది. కాగా ఇటీవల ఆలయాన్ని సందర్శించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాలి అనిల్‌కుమార్ దృష్టికి చోరీ జరిగిన విషయాన్ని ఆలయ నిర్వాహకులు తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎనిమిది సీసీ కెమెరాలను తన సొంత డబ్బులతో ఏర్పాటు చేశాడు.

◆ పాఠశాల తనిఖీ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఎంఈఓ నీలకంఠం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పాఠశాలలో తొలిమెట్టు అమలు, విద్యార్థులకు అందుతున్న బోధనపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు రాగిజావ అందజేత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం రాగిజావను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం వెంకటరాజు, ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ నర్సింలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట మదిర గ్రామం సదాశివ నగరంలో గురువారం సీసీ రోడ్డు పనులను గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు సురేశ్, శంకరయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రాజాగౌడ్, రమేశ్, నాగరాజు, సాయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ బాధితులకు పరిహారం చెక్కులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వర్షాలకు కూలిన ఇళ్లకు సంబంధించిన పరిహారం చెక్కులను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. మండలంలోని గ్రామాల్లో ఇళ్లు కూలిన 36 మందికి పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఇబ్రహీంపూర్ సర్పంచ్ రాములు, నాయకులు ఉన్నారు.

◆ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

చేగుంట(తూప్రాన్): తపస్ ఉపధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19న జరిగే మహాధర్నా విజయవంతం చేయాలని తపస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్ అన్నారు. చేగుంట ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాధవి, వెంకటేశ్, రమేశ్, రఘుపతి, భవానీ, రాజేశ్వరీ, సుమతి, సరస్వతి, శంకర్‌సింగ్ రాథోడ్, యాదగిరి, చక్రదర్‌శర్మ పాల్గొన్నారు.

◆ హవేళీఘనపూర్ తహసీల్దార్‌గా నారాయణ

హవేళీఘనపూర్: హవేళీఘనపూర్ తహసీల్దార్‌గా నారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. కొంత కాలంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నవీన్ కొనసాగగా, తహసీల్దార్‌గా నిజామాబాద్ జిల్లా ఎడపల్లి నుంచి వచ్చిన నారాయణ బాధ్యతలు స్వీకరించారు.

◆ ఆలయాల్లో శ్రావణ శోభ



కౌడిపల్లి(నర్సాపూర్): శ్రావణమాసం మొదటి రోజును పురస్కరించుకొని గురువారం కౌడిపల్లి మండలంలోని వెల్మకన్నలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో శివలింగానికి మల్లికార్జునస్వామికి రుద్రభిషేకం నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

చిన్నశంకరంపేట(మెదక్): సీఎం రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను మండల కేంద్రంలో నిర్వహించారు.

◆ స్పాట్ అడ్మిషన్‌లు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మోడల్ కళాశాలలో సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో మొదటి సంవత్సరం చేరేందుకు ఈనెల 21న స్పాట్ అడ్మిషన్‌లు జరుపుతున్నట్లు ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరాలనుకునే విద్యార్థులు తమ ఒరిజినట్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

◆ సీఎం సభకు జనాలను తరలించాలి

రామాయంపేట(మెదక్): ఈనెల 23న మెదక్‌లో జరిగే సీఎం కేసీఆర్ సభకు పెద్ద ఎత్తున జనాలను తరలించి సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల సమన్వయకర్త శ్రీహరియాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కాట్రియాల, లక్ష్మాపూర్, పర్వతాపూర్, దంతేపల్లి, కిషన్ తండాలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మండల అధికార ప్రతినిధి నరేందర్‌రెడ్డి, మండల యూత్ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 23న మెదక్‌లో సీఎం కేసీఆర్ నిర్వహించే బహిరంగ సభకు కౌడిపల్లి మండలం నుంచి పదివేల మందిని తరలించాలని బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి కుమార్‌యాదవ్ తెలిపారు. గురువారం కౌడిపల్లిలో మండలాధ్యక్షుడు రామాగౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాజునాయక్, నాయకులు అమర్‌సింగ్, కిషోర్‌గౌడ్, నాయికోటి రాజు, శేఖులు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ రైల్వే అభివృద్ధికి కృషి

మనోహరాబాద్(తూప్రాన్): రైల్వే అభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని మెదక్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్ అన్నారు. గురువారం మనోహరాబాద్ రైల్వే స్టేషన్ వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ కన్వీనర్ సాయిబాబా, మండల అధ్యక్షుడు నరేందర్‌చారి, యువ మోర్చా జిల్లా నాయకులు కిరణ్‌యాదవ్, అజయ్‌కుమార్, తూప్రాన్ మండల అధ్యక్షుడు మహేశ్ యాదవ్, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.